క్లుప్తంగా

సీసీ రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం



సీసీ రోడ్డు నిర్మాణంలో మట్టిని పోసి.. ఆపై తొలగిస్తున్న దృశ్యం

దుమ్ముగూడెం: మండలంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం వద్ద ఏ అధికారీ లేకుండా నిర్లక్ష్యంగా చేపడుతున్నారు. గ్రామంలో ముత్యాలమ్మ చెట్టు దగ్గర చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణంలో ముందుగా రోడ్డును సమానం చేసి పైన స్టోన్ డస్ట్ పోసి.. ఆపై రోలింగ్ చేసి వాటరింగ్ చేయాల్సి ఉండగా అటువంటివి ఏమీ లేకుండా స్టోన్ డస్ట్‌తో పాటు మట్టి పోశారు. దీనిని గ్రామస్తులు ఫోటోలు తీయడంతో వెంటనే మట్టిని తొలగించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పది కాలాల పాటు నాణ్యతగా ఉండాల్సిన సీసీ రోడ్లు అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్మాణం చేపడుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై పంచాయతీ రాజ్ ఈఈ శ్రీరామ్‌ను ఫోన్‌లో వివరణ కోరగా ఆదివారం పరిశీలన చేస్తారని తెలిపారు.

పర్ణశాలలో చక్రస్నానం



స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో జరుగుతున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు చివరి రోజు శనివారం స్వామివారికి ఘనంగా పవిత్ర గోదావరి నదిలో చక్రస్నానం నిర్వహించారు. పలు పూజల అనంతరం మంగళ వాయిద్యాలు నడుమ సుదర్శన పెరుమాళ్లను తిరువీధిగా పవిత్ర గోదావరి నదికి తీసుకుని వెళ్లారు. అనంతరం వేదమంత్రాల నడుమ చక్రస్నానం నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్ అర్చకులు కారంపూడి కిరణ్ కుమార్ ఆచార్యులు, భార్గవాచార్యులు, భరద్వాజ చార్యులు, వెంకటాచార్యులు, రాజగోపాల్ ఆచార్యులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలికి గాయాలు

దమ్మపేట: రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని అతి వేగంతో వస్తున్న బైక్ ఢీకొట్టగా, తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని ముష్టిబండ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. సత్తుపల్లి గ్రామానికి చెందిన పామర్తి శ్రీను అను వ్యక్తి సొంత ఊరు నుంచి బైక్‌పై దమ్మపేట వైపుకు వస్తున్నాడు. ఈ క్రమంలో అతడు మండలంలోని ముష్టిబండకు చేరుకున్న సమయంలో, అదే గ్రామానికి చెందిన మహ్మమద్ ఖమరున్నీసా (65) రోడ్డు దాటుతుండగా బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆ వృద్ధురాలికి తీవ్రంగా గాయాలయ్యి, రక్తస్రావమైంది. బైక్‌ను నడుపుతున్న శ్రీనుకు కూడా స్వల్పంగా దెబ్బలు తగిలాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రురాలిని సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం, కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రురాలి భర్త ఆదామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అదనపు ఎస్సై బాల స్వామి తెలిపారు.

అవగాహన ఉండాలి

గుండాల: ఆదివాసీలందరికీ తమ హక్కులపై అవగాహన ఉండాలని, ఆ హక్కులపై పోరాడాలని ఆళ్లపల్లి మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి అన్నారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఏఈడబ్ల్యూసీపీ జిల్లా కార్యదర్శి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా ఆదివాసీ కమ్యూనిటీ హాల్, కొమరం భీం విగ్రహ ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవగాహనతోనే 1/70, పెసా, అటవీహక్కుల చట్టం తదితర చట్టాలను పకడ్బందీగా అమలు చేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో గౌరబోయిన సుబ్బారావు, ఈసం సాంబశివరావు, జోగ సారయ్య, ఈసం సమ్మయ్య, గాదె రాజు, బుట్టు సురేష్, ఊకె కిషోర్, బోజ్జయ్య, సత్యం, వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పేద బ్రాహ్మణులకు శ్రీరామాయణ పారాయణ సేవాసమితి, శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం వారు సంయుక్తంగా శనివారం నిత్యావసర వస్తువుల వితరణ చేశారు. 42వ నెలలుగా పేద బ్రాహ్మణులకు నిత్యావసర వస్తువుల నిరంతర పంపిణీ చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగమణి, విజయలక్ష్మి, కొత్త రామలింగయ్య, డీవీ శంకర రావు, ఆర్కే రామారావు, శంకరావు, కోవూరు సంతోష్, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నేత్రాల నేస్తాలు!

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- కూలింగ్ కళ్లజోళ్లకు డిమాండ్
- అద్దాలతోనే రక్షణ అంటున్న వైద్య నిపుణులు

సండే స్పెషల్



కళ్లజోళ్ల దుకాణంలో పరిశీలిస్తున్న ప్రజలు

భద్రాచలంఅర్బన్: వేసవిలో శరీరంతో పాటు కళ్ల మీద కూడా శ్రద్ధ చూపాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గొంతెండిపోతే గుక్కెడు నీరు, ఇతర పానీయాలు తీసుకుని సేద తీరుతాం. కానీ కళ్ల గురించి మాత్రం పెద్దగా పట్టించుకోం. కళ్లపై అశ్రద్ధ, నిర్లక్ష్యం కంటి వ్యాధులకు కారణమవుతాయని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో సరైన కంటి జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వేడితో ప్రమాదం..

కళ్లలో అతి సున్నితమైన భాగాలకు వేడి తగలడంతో చూపు మందగించే ప్రమాదం ఉంది. మిట్ట మధ్యాహ్నం లేదా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ప్రయాణం చేయడం కంటికి మంచిది కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో వాహనం నడిపితే హెల్మెట్, లేదా కళ్ల జోడును తప్పనిసరిగా పెట్టుకోవాలి. దుమ్ము, ధూళి కంటిలో పడకుండా కూడా ఉపయోగపడుతుంది.

కళ్లు నలపకూడదు..

మధ్యాహ్నం సమయంలో ఎండ చాలా తీవ్రంగా ఉంటుంది. కళ్లకు రక్షణ కవచాలు లేకుండా తిరిగితే మంట పుట్టడంతో పాటు కళ్లు ఎర్రబడుతాయి. ఇటువంటి సందర్భాల్లో కళ్లను చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. వెంటనే సమీపంలోని కంటి వైద్యులను సంప్రదించాలి. కళ్లను నలపడం చేయకూడదు. తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడల్లా చలువ కళ్లజోళ్లు ఉపయోగించాలి. బైక్, కారు మరేదైనా వాహనం నడుపుతున్నప్పుడు సన్ గ్లాసెస్ ధరించడం వల్ల దుమ్ము కణాలు లేదా వేడి గాలి కళ్లలోకి రాకుండా చేస్తుంది. శుక్లం, మాక్యులార్ డీజెనరేషన్ వంటి సమస్యలు రాకుండా చేస్తుంది. ద్విచక్ర వాహన దారులు వీలైనంత వరకు క్లోజ్ హెల్మెట్‌లను వాడటం మంచిది.

జోరందుకున్న అమ్మకాలు..

భద్రాచలం పట్టణంలోని అన్ని కళ్లజోడ్ల దుకాణాలతో పాటు రోడ్డు మీద విక్రయిస్తున్న కళ్లజోడ్లకు ఎండ వేడి కారణంగా గిరాకీ పెరిగింది. భద్రాచలం పట్టణంలో అత్యధిక శాతం ద్విచక్ర వాహనాలు నడుపుతున్న సమయంలో వాహనదారులు నల్లరంగు కళ్లజోడ్లు ధరిస్తున్నారు. కాగా రానున్న రోజుల్లో ఎండ వేడి పెరిగే అవకాశం ఉన్నందున్న పట్టణ ప్రజల్లో వీటి వాడకం పెరిగే అవకాశం ఉంది.

జాగ్రత్తలు పాటించాలి



ద్విచక్ర వాహనాలపై ప్రయాణించినప్పుడు వేసవిలో ఎండ ప్రభావంతో వచ్చే వెలుతురు, వేడి నుంచి కళ్లకు జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే కళ్లలోని రక్షణ పొర కరిగిపోయి, కళ్లు ఫొటో సెన్సిటివిటీకి గురవుతాయి. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా బయటకు వెళ్లినప్పుడు చలువ కళ్లద్దాలు, హెల్మెట్, టోపీ, రుమాలు ధరించాలి.

– డాక్టర్ సంతోష్, కంటి వైద్య నిపుణుడు, భద్రాచలం ఏరియా ఆస్పత్రి

అమ్మకాలు పెరిగాయి



లోకల్ బ్రాండ్స్ పాటు అన్ని వెరైటీల్లో బ్రాండెడ్ కాళ్లజోడ్లు తెప్పించాం. వేసవిలో కళ్లజోడ్ల వినియోగం ఎక్కువగా ఉంటోంది. హైదరాబాద్ వంటి నగరాల్లో లభించే కళ్ళజోళ్లు ఇప్పుడు భద్రాచలంలో కూడా లభ్యత కావడంతో వినియోగదారుల నుంచి ఆదరణ ఎక్కువైంది. బ్రాండెడ్‌తో పాటు సాధారణ మోడళ్లలో కాళ్లజోళ్లు అమ్మకాలు పెరిగాయి. రెండు నెలలు సీజన్ ఉంటుంది.

– ఇషాక్, కళ్లజోళ్ల వ్యాపారి, భద్రాచలం

రాజ్యాంగ పరిరక్షణకు పోరాడాలి



ములకలపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

చండ్రుగొండ: డాక్టర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు పోరాడాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పిలుపునిచ్చారు. మండలకేంద్రం చండ్రుగొండలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. అనంతరం పోకలగూడెం గ్రామంలోని పాఠశాలలో గెయిల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన జిమ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎల్‌ఓసీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దామరచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. కార్యక్రమాల్లో భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, నల్లమోతు రమణ, దారం గోవిందరెడ్డి, సొసైటీ చైర్మెన్ చెవుల చందర్‌రావు, నల్లమోతు వెంకటనారాయణ, ఎండి.ఇమ్రాన్, వసీం, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు. మండల కేంద్రం అన్నపురెడ్డిపల్లిలో శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు వనమా గాంధీ, పర్సా వెంకటేశ్వరరావు, వేముల రమణ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గుంపుల రవితేజ, మండల ఇన్‌చార్జ్ అజ్మీరా సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు అండగా ఉంటాం

అశ్వారావుపేటరూరల్: జానపద కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం స్థానిక గిరిజన భవన్‌లో జానపద కళాకారుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. కళాకారుల గీతాలు, ఫైర్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సత్యనారాయణ, జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, చుంచు లింగన్న, పంబి రవి, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ముర్తుజా ఖాన్, ఈశ్వర్ బహుదుర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ విజయోత్సవం

చండ్రుగొండ: మండలంలోని మంగయ్యబంజర్ గ్రామంలో హనుమాన్ విజయ యాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో హోమాలు చేశారు. నైవేద్యం పెట్టారు. స్వామివారి చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు.


బైక్ ర్యాలీ..

ములకలపల్లి: వీరహనుమాన్ విజయ యాత్రను శనివారం ములకలపల్లిలో ఘనంగా నిర్వహించారు. తొలుత భక్త అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజారి విస్సావఝ్జుల సురేశ్ శర్మ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ముకందుల రమాదేవి, శనగపాటి శ్రీలత జెండా ఊపి, బైక్‌ర్యాలీని ప్రారంభించారు. ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఉమా పృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయం, షిర్డీ సాయిబాబా మందిరం మీదుగా మాధారంలోని హనుమాన్ టెంపుల్ వరకూ ద్విచక్ర వాహనాలతో భారీగా ప్రదర్శన నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు డాక్టర్ కారంపూడి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పువ్వాల శ్రీనివాస్, జిల్లా సామరస్యతా ప్రముఖ్ గొడ్ల రాజు, అత్యం సాయి, మిరియాల అవినాశ్, రామకృష్ణ, అనిరుద్ తదితరులు పాల్గొన్నారు.



చండ్రుగొండ: మంగయ్యబంజర్ గ్రామంలో హనుమాన్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కుంజా బొజ్జికి ఘన నివాళి



భద్రాచలంఅర్బన్: మాజీ ఎమ్మెల్యే బొజ్జి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: కుంజా బొజ్జి వర్ధంతి సభను భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాజుపేట ఎమ్మెల్యే కాలనీలో పార్టీ సీనియర్ నాయకుడు నాదెళ్ల లీలావతి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముందుగా కుంజాబుజ్జి స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ఆవిష్కరించగా.. బొజ్జి చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారివురు మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధిలో బొజ్జి పాత్ర మరువలేనిదని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ.నర్సారెడ్డి, కొలగాని బ్రహ్మచారి పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, సున్నం గంగా, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామంలోని యలమంచి సీతారామయ్య భవనంలో సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి 4వ వర్ధంతి సభను సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. బొజ్జి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, నాయకులు బిల్లా ముత్యాలరావు, కల్లూరి శ్రీను, చంటి, నాగరాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్ల: కుంజా బొజ్జి వర్ధంతిని పురస్కరించుకుని చర్లలోని బీఎస్ రామయ్యభవన్‌లో శనివారం వర్ధంతి సభను ఏర్పాటు చేశారు. బొజ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు కారం నరేష్, నాయకులు బి.నవీన్, బందెల చంటి, పాడుపుగంటి సమ్మక్క, పామారు బాలాజీ, వరదల వరలక్ష్మి, పాముల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రోత్సరణ నడుమ భక్తులు తిలకిస్తుండగా స్వామివారి కల్యాణ క్రతువు జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు.

వనజీవి రామయ్య మృతిపై సంతాపం

అశ్వారావుపేటరూరల్: పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య గుండెపోటుతో మృతి చెందడం పట్ల పలు పార్టీ నాయకులు వేర్వేరుగా సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో స్థానిక కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, తుమ్మా రాంబాబు, బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బిర్రం వెంకటేశ్వరరావు, మందపాటి మోహన్‌రెడ్డి, సీపీఎం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, సీపీఐ నాయకులు ఎస్‌డీ సలీం, టీడీపీ నాయకులు స్వామి ఉన్నారు.

మణుగూరురూరల్: ప్రకృతి ప్రేమికుడు వనజీవి దరిపెల్లి రామయ్య మృతి బాధాకరమని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రామయ్య మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

బాధ్యతగా మెలగాలి

ములకలపల్లి: ప్రతీ ఒక్కరూ తమ కుటుంబం పట్ల బాధ్యతతో మెలగాలని జమాతే ఇస్లామీ హింద్ (జేఐహెచ్) మహిళా ప్రతినిధి (నాజిమా) తస్లీమ్ అన్నారు. జగన్నాథపురంలో శనివారం నిర్వహించిన మహిళల సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. మహిళలు ప్రధానంగా పిల్లల విషయంలో బాధ్యత తీసుకోవాలని సూచించారు. సమాజంలో నెలకొన్న నియమాలకు కట్టుబడి జీవితం గడపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు ఫౌజియా, ఫర్హానా, ఫాతిమా, హిబా అర్జుమంద్, సనా తదితరులు పాల్గొన్నారు.

'కగార్'ను నిలిపివేయాలి

బూర్గంపాడు: ఆపరేషన్ కగార్‌ను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని తెలంగాణ రైతు కూలీసంఘం నాయకులు డి.పున్నంచంద్, వైఎస్‌రెడ్డి కోరారు. తెలంగాణ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం బూర్గంపాడు మండలంలో కరపత్రాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీల హత్యాకాండకు వ్యతిరేకంగా ఏఐకేఎమ్ఎస్, ఏఐకేఎమ్‌కేఎస్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 25న కొత్తగూడెంలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని కోరారు. మల్లికంటి రాము, కుంజా వెంకటేశ్వర్లు, సోమక్క, బండ రాంబాబు, కృష్ణవేణి, నాగమణి, వెంకటలక్షిమ పాల్గొన్నారు.

చలో గావ్ అభియాన్

చర్ల: చర్ల మండలంలో బీజేపీ నాయకులు చలో గావ్ అభియాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నూపా నమేష్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గూనూరి రమణ నాయకులు ఇర్పా సుబ్బారావు, ముత్తారం శ్రీనివాసాచారి, విశ్వనాథం తదితరులు కార్యక్రమంలో భాగంగా చర్లలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని అమ్మవారి దేవాలయాన్ని శుభ్రం చేయడంతో పాటు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలను అడిగితెలుసుకున్నారు.

ఐటీసీ సహకారం అభినందనీయం

బూర్గంపాడు/అశ్వాపురం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఐటీసీ అందిస్తున్న సహకారం అభినందనీయమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు మండలం కృష్ణసాగర్‌లో ఐటీసీ నిర్మించిన బస్‌షెల్టర్, లక్ష్మీపురంలో అంగన్‌వాడీ నూతన భవనంతో పాటు అశ్వాపురం మండలం రామచంద్రాపురంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన బస్టాండ్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సామాజిక బాధ్యతగా గ్రామాల్లో వసతుల కల్పనకు ఐటీసీ సహకరిస్తోందని, ప్రభుత్వంతో పాటుగా ఐటీసీ వంటి సంస్థల చేయూతతో గ్రామాల అభివృద్ధి త్వరగా సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఐటీసీ జనరల్ మేనేజర్ చెంగలరావు, ఎంపీడీఓ జమలారెడ్డి, తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీఓ ముత్యాల రావు, ఆర్ఐ లావణ్య, పంచాయతీ కార్యదర్శి తౌఫిక్, నెల్లిపాక పీఏసీఎస్ చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డితో పాటు నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బాదం రమేష్‌రెడ్డి, కాకా అశోక్, ఏనుగు కృష్ణారెడ్డి, నాయకులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బూరెడ్డి వెంకటరెడ్డి, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, వీరభద్రారెడ్డి, మాసిరెడ్డి వెంకటరెడ్డి, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు. కాగా, అశ్వాపురం మండలం రామచంద్రాపురంలో ఇటీవల మృతి చెందిన పగడాల పద్మారెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య పరామర్శించారు. అలాగే, మల్లెలమడుగులో పలు కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరు కాగా.. అక్కడ ఐస్ అమ్ముతున్న వ్యక్తిని పలకరించి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు.



మణుగూరురూరల్: ఎమ్మెల్యే పాయంకు వినతిపత్రం అందజేస్తున్న వాసవీనగర్‌వాసులు

వాసవీనగర్ సందర్శన

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ వాసవీనగర్ ప్రాంతాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం సందర్శించి కాలనీ వాడలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో ఆయన సమావేశమై అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి సమస్యలను వినతిరూపంలో స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా.. ప్రత్యేక వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు, ఆర్యవైశ్య సంఘ భవన నిర్మాణానికి నిధుల మంజూరికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వాసవీనగర్ కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల వార్షికోత్సవం



అన్నపురెడ్డిపల్లి: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ బాలరాజు

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని టీఎస్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్స్‌పాల్ టి.బాలరాజు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధిపై విద్యార్థుల ప్రతిభపై ఆయన మాట్లాడారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ సీహెచ్ చంద్రశేఖర్, పేరెంట్స్ కమిటీ చైర్మెన్ పెద్దారపు నాగరాజు, ఉపాధ్యాయులు జేఎల్.నర్సింహారావు, పిల్ల బాలకృష్ణ, సుధాకర్, ఏ.ప్రసాద్, వేంకటేశ్వరరావు, గోపయ్య, రాజేందర్, ముత్యం, ప్రవీణ్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

అశ్వారావుపేటరూరల్: ప్రతి విద్యార్థీ డిగ్రీ తర్వాత ఉన్నత విద్యను కొనసాగించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.స్పందన కోరారు. శనివారం మండల పరిధిలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలో ఉన్న గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (దమ్మపేట)లో ఫేర్‌వెల్ పార్టీ సంబురాలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడారు. అనంతరం కళాశాల విద్యార్థినులు ఆట, పాటలతో సందడి చేయడంతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సింధుశ్రీ, అధ్యాపకులు ఉమా పార్వతి, అరుణ, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సర్వీస్ మేళా

భద్రాచలంటౌన్: భచలం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో బీఎస్ఎన్ఎల్ సంస్థ వారు ఏప్రిల్ నెలను కస్టమర్ నెలగా ప్రకటించి శనివారం సర్వీస్ మంత్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ అధికారులు మాట్లాడుతూ.. వినియోగదారులకు మెరుగైన సేవల్లో భాగంగా ఉత్తమమైన సేవలను అందించడానికి బీఎస్ఎన్ఎల్ సంస్థ చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. సౌకర్యాల కోసం పోర్టల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. క్యూఆర్ స్కాన్ కోడ్ ద్వారా సేవలను సులభంగా పొందవచ్చని, 18004444 నెంబర్ ద్వారా వాట్సప్ సేవలను పొందవచ్చు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 460 టవర్స్ ద్వారా కొత్తగా 4జీ సేవలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఖమ్మం డీజీఎమ్ శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, ఏజీఎం సీఎం సుధీర్, మదన్ గోపాల్, అంకిత్, ప్రవీణ్, సైదులు, ఆశీర్వాదం, సత్యనారాయణ, పెరుమాళ్ళ ఉదయ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

దుమ్ముగూడెం: మండలంలోని పిరాయిగూడెం గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ దుమ్ముగూడెం మండల శాఖ రూ.25 వేలు నగదు, 50 కేజీల బియ్యాన్ని శనివారం అందజేశారు. బాధిత కుటుంబాలకు ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయ బాబు, ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు చేతుల మీదుగా వితరణ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం, ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలు స్పందించి వారికి సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి బొర్రయ్య, సవలం వీరాస్వామి, ఏటీఏ మండల అధ్యక్షుడు వాసం ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి పూనెం రమేష్, ఏఎస్పీ మండల అధ్యక్షుడు కుర్సం రవి, మట్ట వెంకటేశ్వర్లు, కారం శ్రీను, తెల్లం హరికృష్ణ, కోరం మురళి, కారం నవీన్, వాగే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. రామచంద్రాపురం గ్రామానికి చెందిన బాల్దా అరుణమ్మ పూరిల్లు విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన విషయం విదితమే. దీంతో బాధితులకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు రూ.5 వేలు ఆర్థికసాయం ప్రకటించగా, స్థానిక నాయకులు 16వేలు ఇచ్చారు. శనివారం పార్టీ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి చేతుల మీదుగా రూ.21 వేల నగదును అరుణమ్మకు అందజేశారు. కార్యక్రమంలో భారత రాంబాబు, కుమ్మరి రాంబాబు, అచ్చెన కృష్ణారావు, రొంటె నాగేశ్వరరావు, చిన్నం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, అరుణమ్మ కుటుంబానికి గ్రామస్తులు 25 కిలోల బియ్యం, ఎలక్ట్రిక్ వస్తువులు, కొంతనగదు వితరణగా ఇచ్చారు. మాజీ సర్పంచ్ సున్నం సుధాకర్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. జబ్బూరి గోపాల్, ప్రసాద్, అచ్చెన వెంకటేశ్వర్లు, చెన్నా, హరి, రవి, రంగారావు, రాంబాబు, పుల్లారావు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం: బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

వక్ఫ్ చట్ట సవరణపై నిరసన

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డ్ చట్టానికి సవరణలు తీసుకురావడంపై సీపీఐ ఆధ్వర్యంలో శనివారం పలుచోట్ల నిరసనలు చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి రహదారులపై నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి నియంత ధోరణిలో సవరణలు చేసిందని, ఇది ప్రజా వ్యతిరేకమని విమర్శించారు. కార్యక్రమాల్లో సీపీఐ, అనుబంధ ఏఐటీయూసీ నాయకులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు



చర్ల: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన..



దమ్మపేట: సీపీఐ ఆధ్వర్యంలో రహదారిపై నిరసన..